



సమావేశంలో పాల్గొన్న ఇరు రాష్ట్రాల పోలీసు అధికారులు

పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో బేలలో అంతర్ రాష్ట్ర పోలీసుల సమావేశం

జైనథ్ రూరల్, ఏప్రిల్ 5: పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో శుక్రవారం బేల మండల కేంద్రంలోని స్థానిక పోలీసు స్టేషన్ కార్యాలయంలో జైనథ్ రూరల్ సీఐ సాయినాథ్, కొర్పన ఠానేదార్ సందీప్ ఎకానుకు సమావేశంలో పాల్గొన్నారు. రాబోయే పార్లమెంట్ ఎన్నికల్లో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు ఎదురుకాకుండా తీసుకోవాల్సిన చర్యలపై తెలంగాణ, మహారాష్ట్ర పోలీసులు చర్చించారు. జైనథ్ మండల సరిహద్దున గల పెన్‌గంగా ఆనంద్‌పూర్, బేల మండలంలో ఉపసానాల ప్రాంతంలో భారీ పోలీసు బందోబస్తు ఉండే విధంగా ఇరు రాష్ట్రాల పోలీసు అధికారులు చేస్తామన్నారు. దీంతో పాటు అక్రమ మద్యం, డబ్బుల రవాణా తదితర అంశాల పై విస్తృతంగా చర్చించారు. ఈ కార్యక్రమంలో బేల ఎస్సై రాధికలతో పాటు బేల కొర్పన పోలీసు సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్‌లో.. కొత్త పంచాయితీ!



- జిల్లాలో వలస నేతల చేరికలపై ముదురుతున్న లొల్లి
- అంతర్గతంగా రగిలిపోతున్న పార్టీ శ్రేణులు
- కొత్త నేతల రాకతో ప్రాధాన్యత కరువవుతోందన్న ఆందోళన
- రాజకీయ భవిష్యత్తు కోసమే అధికార పార్టీలోకి అడుగులు
- నచ్చచెప్పే ప్రయత్నం చేస్తున్న పార్టీ పెద్దలు

ఆదిలాబాద్, ఏప్రిల్ 5(ఆంధ్రజ్యోతి): గత కొద్ది రోజులుగా వరుస చేరికలతో మంచి ఊపులో కనిపిస్తున్న కాంగ్రెస్ పార్టీని కొత్త వివాదం చుట్టుముడుతోంది. వలస నేతల చేరికలపై వివాదం మరింత ముదురుతోంది. పదేళ్ల తర్వాత అధికారంలోకి వచ్చామన్న సంతోషమే తప్ప వలస నేతలతో అసలు మనశాంతే లేకుండా పోయిందన్న వాదనలు వినిపిస్తున్నా యి. ఎన్నో ఒడిదుడుకులను తట్టుకుని పార్టీలో పని చేసిన సరైన గుర్తిం పు ఇవ్వడం లేదంటూ పలువురు నేతలు ఆవేదనకు గురవుతున్నారు. లోక్‌సభ ఎన్నికలు దగ్గర పడుతున్న కొద్ది బీఆర్ఎస్ నుంచి పార్టీలోకి వలసల జోరు పెరగడంతో అభ్యంతరాలు వ్యక్తమవుతున్నాయి. ఆ నేతలు మా కొద్దు అంటూ అధిష్ఠానం వద్ద మొరపెట్టుకుంటున్నారు. ఈ క్రమంలోనే జడ్పీ చైర్మన్ రాథోడ్ జనార్ధన్, బోథ్ మాజీ ఎమ్మెల్యే రాథోడ్ బాపురావులు కాంగ్రెస్‌లో చేరేందుకు సిద్ధమైనా.. జిల్లా నేతలు అభ్యంతరం చెప్పడంతో పార్టీ అధిష్ఠానం వారిని పక్కన పెట్టిందన్న ప్రచారం జరుగుతోంది. మరికొందరు నేతలు కాంగ్రెస్‌లో చేరేందుకు సిద్ధమవుతున్నా.. స్థానిక రాజకీయ పరిస్థితులతో అభ్యంతరాలు వ్యక్తం కావడంతో పార్టీ అధిష్ఠానం డైలామాలో పడినట్లు కనిపిస్తుంది. అలాగే అసెంబ్లీ ఎన్నికల్లో పార్టీ నిర్ణయానికి వ్యతిరేకంగా పనిచేసిన నలుగురు సీనియర్ నేతలను పక్కన పెట్టడంపై రాజకీయ వర్గాల్లో చర్చనీయాంశంగా మారింది. అయితే ఇన్నాళ్లు పార్టీని నమ్ముకుని పనిచేసిన వారిని పక్కనపెట్టి కొత్తగా పార్టీలో చేరిన వారికి ప్రాధాన్యత ఇవ్వడం ఏమిటన్న ప్రశ్నలు వినిపిస్తున్నాయి. నియోజకవర్గ ఇన్‌చార్జీల వద్ద నిత్యం ఇదో పెద్ద పంచాయితీగా మారిందన్న అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. అధిష్ఠానం ఆదేశాలను కాదనలేక, సన్నిహితుల మాటకు నో చెప్పలేక నియోజకవర్గ ఇన్‌చార్జీలు సతమతమవుతున్నారు. నేరుగా అధిష్ఠానం పెద్దలే రంగంలోకి దిగి నచ్చ చెప్పాల్సిన పరిస్థితులు ఏర్పడుతున్నాయన్న టాక్ వినిపిస్తోంది.



చెప్పుకోలేని పరిస్థితి

పదేళ్ల పాటు అధికారంలో ఉన్న బీఆర్ఎస్ నేతల ఒత్తిళ్లతో తీవ్రంగా నష్టపోయిన పార్టీ కార్యకర్తలు ఆవేదనకు గురవుతున్నారు. ఇన్నాళ్లు వేధింపులకు గురి చేసిన నేతలే.. ఇప్పుడు దర్జాగా పార్టీలో చేరడంపై కార్యకర్తలు జీర్ణించుకోలేక పోతున్నారు. స్థానిక పరిస్థితులను పార్టీ అగ్రనేతలకు చెప్పుకోలేక.. పార్టీని వీడివెళ్లే ధైర్యం చేయలేక.. లోలోన రగిలి పోతున్నారు. ఇన్నాళ్లు రాజకీయ శత్రువులుగా భావించిన వారే ఇప్పుడు పార్టీలో చెలామణి కావడంతో అసంతృప్తి వ్యక్తమవుతోంది. గతంలో జరిగిన రాజకీయ పరిణామాలను గుర్తు చేసుకుంటూ ఆవేదనకు లోనవుతున్నారు. పార్టీ అగ్రనేతల పర్యటనల్లో పైపైకి బాగానే కనిపిస్తున్నా.. లోలోన మాత్రం ఒకరిపై ఒకరు రగిలిపోతున్నట్లు తెలుస్తుంది. కొత్త, పాత నేతలంతా ఒకే పార్టీలో కొనసాగుతున్నా.. అంతర్గతంగా మాత్రం అభిప్రాయబేధాలు ఉన్నట్లు తెలుస్తుంది. క్షేత్రస్థాయిలో పార్టీలో చోటు చేసుకుంటున్న పరిణామాలను అగ్రనేతల దృష్టికి తీసుకెళ్లే ప్రయత్నం చేస్తున్నా.. లోక్‌సభ ఎన్నికలతో ఏమీ చేయలేని పరిస్థితి ఉందన్న అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. అధిష్ఠానం పెద్దలు పార్టీ బలోపేతంపై ప్రత్యేకదృష్టిని సారిస్తున్నా.. క్షేత్రస్థాయిలో మాత్రం భిన్నమైన పరిస్థితులే కనిపిస్తున్నాయి. నేతల మధ్య సమన్వయం కరువై ఐక్యత కనిపించడం లేదు. దీంతో రాబోయే ఎన్నికల్లో పార్టీ విజయ అవకాశాలు దెబ్బతినే అస్కారం ఉందన్న వాదనలు వినిపిస్తున్నాయి.

సన్నగిల్లుతున్న ఆశలు

ఇన్నాళ్లు పార్టీ అధికారంలోకి వస్తే ఏదో ఒక నామినెట్ పదవి దక్కుతుందని భావించిన నేతల్లో ఆశలు సన్నగిల్లుతున్నాయి. వలస నేతల పోటీకి తట్టుకోలేక ఆందోళనకు గురవుతున్నారు. భవిష్యత్తులోనైనా పార్టీ పదవులతో పాటు నామినెట్ పదవులు దక్కుతాయో? లేవో?నన్న అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. సీనియార్టీని పక్కన పెట్టి వలస నేతల పలుకుబడికి పార్టీలో ప్రాధాన్యతను ఇస్తున్నారన్న చర్చ సాగుతోంది. ఇన్నాళ్లు పార్టీ అధికారంలో లేకపోవడంతో పదవులకు దూరమైనా.. ఇప్పుడైనా పదవులు దక్కుతాయన్న గ్యారంటీ కూడా లేకుండా పోయిందంటున్నారు. దశాబ్దాలుగా పార్టీనే నమ్ముకుని పని చేస్తున్నా.. ప్రస్తుతం ఉన్న పరిస్థితుల్లో న్యాయం జరిగేలా కనిపించడం లేదంటున్నారు. పార్టీలో కొత్త తరం నేతలదే పైచేయి కావడంతో పాతతరం నేతలంతా పార్టీకి దూరంగా ఉంటున్నారు. రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లోనైనా అవకాశం కల్పిస్తారా? లేదా? సర్వేలా పేరిట పక్కన పెడతారా? అనేది అంతుచిక్కడం లేదంటున్నారు. పార్టీ అధికారంలోకి రావడంతో ఎంతో సంబురపడ్డా.. వలస నేతల పోటీకి తట్టుకునే పరిస్థితులు లేవంటున్నారు. పార్టీలో కొత్త నేతల సందడి పెరిగిపోవడంతో ప్రాధాన్యత తగ్గుతుందేమోనన్న ఆందోళన పార్టీ క్యాడర్‌ను వెంటాడుతోంది.

వలస నేతల ముందుచూపు

ఇన్నాళ్లు అధికారంతో తెగ ఎంజాయ్ చేసిన నేతలే.. కాంగ్రెస్ పార్టీలో చేరుతున్నారన్న అభిప్రాయాలు వినిపిస్తున్నాయి. రాజకీయ భవిష్యత్తుపై ముందుచూపుతో కాంగ్రెస్ వైపు అడుగులు వేస్తున్నట్లు తెలుస్తుంది. అలాగే కొంతమంది నేతలు అక్రమ వ్యాపారాలను కాపాడుకునేందుకు అధికార పార్టీ కండువా వేసుకుంటున్నట్లు ప్రచారం జరుగుతుంది. రాష్ట్ర వ్యాప్తంగా బీఆర్ఎస్ పూర్తిగా డీలా పడిపోవడంతో.. ఆ పార్టీ నేతలంతా కాంగ్రెస్‌లో గంపగుత్తగా చేరిపోవడం కనిపిస్తుంది. లోక్‌సభ ఎన్నికలు దగ్గర పడడంతో కాంగ్రెస్ కూడా కొత్త చేరికలను ప్రోత్సహిస్తుంది. అయితే చీమలు పెట్టిన పుట్టలో పాములు దూరిన చందంగా కాంగ్రెస్ పార్టీలో చేరికలు జరుగుతున్నాయన్న చర్చ సాగుతోంది. కొంతమంది నేతలు మాత్రం రాబోయే స్థానిక సంస్థల ఎన్నికలను దృష్టిలో పెట్టుకుని అధికార పార్టీలో చేరేందుకు సిద్ధమవుతున్నారు. అలాగే ప్రభుత్వ సంక్షేమ పథకాల్లోనూ ప్రాధాన్యత ఉంటుందన్న ఉద్దేశంతోనే కాంగ్రెస్ గూటికి చేరుతున్నారన్న అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. స్థానిక రాజకీయ సమీకరణల్లో భాగంగా తమ రాజకీయ భవిష్యత్తుకు ఎలాంటి ఢోకా లేకుండా నేతలు జాగ్రత్త పడుతున్నట్లు తెలుస్తుంది.



మాట్లాడుతున్న అసిస్టెంట్ కలెక్టర్ వికాస్ మెహతా

ఓటు హక్కును ప్రతీఒక్కరు వినియోగించుకోవాలి

- అసిస్టెంట్ కలెక్టర్ వికాస్ మెహతా

బజార్‌హత్నూర్, ఏప్రిల్ 5: త్వరలో జరగనున్న లోక్‌సభ ఎన్నికలలో ఓటుహక్కు ఉన్న ప్రతీఒక్కరు తమ ఓటునుక నిర్భయంగా వినియోగించుకోవాలని అసిస్టెంట్ కలెక్టర్ వికాస్ మెహతా అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలోని పోలీస్ స్టేషన్ నుంచి ప్రధాన కూడలి వరకు ఓటు హక్కు వినియోగం గురించి మండలవాసులకు అవగాహన కల్పించేందుకు సంబంధిత శాఖల అధికారులతో కలిసి ర్యాలీని నిర్వహించారు. అనంతరం రైతువేదికలో ఏర్పాటు చేసిన సమావేశంలో అసిస్టెంట్ కలెక్టర్ వికాస్ మెహతా మాట్లాడుతూ.. 18 సంవత్సరాలు నిండిన ప్రతీఒక్కరు నూతన ఓటు కోసం స్థానిక బీఎల్‌వోల దగ్గర దరఖాస్తు చేసుకవాలని యువతకు సూచించారు. లోక్‌సభ ఎన్నికల నిర్వాహణకు సంబంధించి అన్ని పనులను పూర్తి చేశామన్నారు. ప్రశాంత వాతావరణంలో ఎన్నికలను నిర్వహించేందుకు ఓటర్లు సహకరించాలని, వంద శాతం పోలింగ్ సరిగే విదంగా ఓటర్లకు అవగాహణ కల్పించాలని అధికారులకు సూచించారు. ఈ కార్యక్రమంలో స్థానిక తహశీల్దార్, శంకర్, ఎంపీడీవో శ్రీనివాస్, డీఎస్‌వో వెంకటేశర్లు, మండల ప్రత్యేక అధికారులు, కార్యదర్శులు, తదితరులు పాల్గొన్నారు.

బూటకపు హామీలతో గద్దెనెక్కిన కాంగ్రెస్ : జోగు రామన్న

- నేడు ఆర్‌అండ్‌బీ గెస్ట్‌హౌజ్ ఎదుట రైతు దీక్ష



మాట్లాడుతున్న మాజీ మంత్రి జోగు రామన్న

ఆదిలాబాద్ అర్బన్, ఏప్రిల్ 5: అన్నదాతలకు బూటకపు హామీలు ఇచ్చి గద్దెనెక్కిన కాంగ్రెస్ ప్రభుత్వం.. వాటిని అమలు చేయడంలో మాత్రం నిర్లక్ష్య ధోరణిని అవలంభిస్తోందని బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు, మాజీ మంత్రి జోగు రామన్న అన్నారు. శుక్రవారం పట్టణంలోని పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన ఎంపీ అభ్యర్థి ఆత్రం సక్కుతో కలిసి విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాజీ మంత్రి జోగు రామన్న మాట్లాడుతూ రైతుల సంక్షేమాన్ని విస్మరిస్తే సహించే ప్రసక్తే లేదన్నారు. అన్నదాతలకు ఇచ్చిన హామీలను నెరవేర్చాలని డిమాండ్ చేస్తూ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ సూచనల మేరకు ఈనెల 6న స్థానిక ఆర్ అండ్‌బీ గెస్ట్‌హౌజ్ ఎదుట రైతు దీక్ష చేపట్టనున్నట్లు తెలిపారు. రైతులంతా పార్టీలకు అతీతంగా దీక్షలో పాల్గొని జయప్రదం చేయాలని కోరారు. ఎకరానికి రూ.15 వేల రైతు భరోసా, రైతు కూలీలకు ఆర్థిక సహాయం, తదితర హామీలను కాంగ్రెస్ ప్రభుత్వం బుట్టదాఖలు చేస్తోందని మండిపడ్డారు. సోనియా గాంధీ జన్మదినం నుంచి అమలు చేస్తామన్న రుణమాఫీ హామీ నాలుగు నెలలైనా అమలు కాలేదని గుర్తు చేశారు. పంటలను బోనస్‌తో కొనుగోలు చేస్తామన్న మాటను, ప్రభుత్వం నిలబెట్టుకోవాలని పలు డిమాండ్లు వ్యక్తం చేశారు. అన్నదాతలకు అండగా బీఆర్ఎస్ ఉంటుందని, రైతుదీక్షను విజయవంతం చేయాలని కోరారు. ఇందులో పట్టణ అధ్యక్షుడు అజయ్, విజ్జగిరి నారాయణ, కుమ్ర రాజు, ఎంపీపీ రమేష్, పరమేశ్వర్, అశ్రఫ్, సతీస్, రాజన్న, వేణుగోపాల్ యాదవ్, తదితరులు పాల్గొన్నారు.

మహనీయులను స్ఫూర్తిగా తీసుకోవాలి

- బాబూజగ్జీవన్‌రామ్ జయంతి వేడుకల్లో జిల్లా కలెక్టర్ రాజార్షి షా
- పాల్గొన్న ఎమ్మెల్యేలు పాయల శంకర్, వెడ్మ బొజ్జు పటేల్
- ఘన నివాళులు అర్పించిన అధికారులు, ప్రజాప్రతినిధులు

ఆదిలాబాద్ అర్బన్, ఏప్రిల్ 5: బలహీన వర్గాల కోసం మహనీయులు చేసిన త్యాగాలను ప్రతిఒక్కరూ గుర్తించాలని జిల్లా కలెక్టర్ రాజార్షిషా అన్నారు. జిల్లాకేంద్రంలో శుక్రవారం మాజీ ఉప ప్రధానమంత్రి దివంగత నేత బాబూజగ్జీవన్‌రామ్ జయంతిని అధికారికంగా నిర్వహించారు. దీనిలో భాగంగా స్థానిక ఎస్సీ కార్పొరేషన్ ఆవరణలోని బాబూజగ్జీవన్‌రాం చిత్రపటం వద్ద కలెక్టర్ అధికారులు, ఆయా సంఘాల నాయకులతో కలిసి పూలమాలలు వేసి నివాళ్లర్పించారు. అనంతరం అదే ఆవరణలోని అంబేద్కర్, మహాత్మాజ్యోతి బాపూలే దంపతుల విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా కలెక్టర్ రాజార్షిషా మాట్లాడుతూ మహనీయులను స్ఫూర్తిగా తీసుకుని యువత ప్రభుత్వ అవకాశాలను సద్వినియోగం చేసుకుంటూ ఉన్నతంగా ఎదగాలన్నారు. సమసమాజ స్థాపన కోసం మహనీయులు చేసిన కృషి, వారి జీవిత చరిత్రలను నేటి యువత తెలుసుకోవాల్సిన అవసరం ఉందన్నారు. జగ్జీవన్‌రామ్ చేసిన సేవలను గుర్తిస్తూ ప్రభుత్వం జయంతిని అధికారికంగా నిర్వహిస్తుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో దళిత అభివృద్ధి అధికారి సునిత, అధికారులు, వివిధ సంఘాల నాయకులు పాల్గొన్నారు.



ఆదిలాబాద్ నివాళ్లర్పిస్తున్న జిల్లా కలెక్టర్ రాజార్షిషా



జగ్జీవన్‌రాం చౌక్‌లో నివాళ్లర్పిస్తున్న ఎమ్మెల్యే పాయల శంకర్

జగ్జీవన్‌రామ్ సేవలు మరువలేనివి : పాయల

ఆదిలాబాద్ అర్బన్: దళితుల అభ్యున్నతితో పాటు బడుగు బలహీన వర్గాల కోసం మాజీ ఉప ప్రధాని బాబూజగ్జీవన్‌రామ్ చేసిన సేవలు ఎనలేనివని ఎమ్మెల్యే పాయల శంకర్ అన్నారు. శుక్రవారం బాబూజగ్జీవన్‌రామ్ జయంతి వేడుకల్లో ఎమ్మెల్యే పాల్గొన్నారు. పట్టణంలోని జగ్జీవన్‌రాం చౌక్ లో ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ దళితుల సంక్షేమం కోసం జగ్జీవన్ రామ్ చేసిన సేవలను కొనియాడారు. ఆ మహనీయుని జయంతిని ఘనంగా నిర్వహించుకోవడం జరుగుతుందన్నారు. 27ఏళ్లకే శాసనసభ మండలి సభ్యుడిగా ఎన్నికయ్యారని, 33ఏళ్ల పాటు కేంద్ర మంత్రిగా, ఉప ప్రధానిగా జగ్జీవన్‌రాం అందించిన సేవలు మరువలేనివని తెలిపారు. జయంతి, వర్ధంతుల రోజునే వారిని స్మరించకుండా వారి ఆశయా లు, ఆలోచనలకు అనుగుణంగా ప్రతిఒక్కరూ ముందుకు సాగాలని పిలుపు నిచ్చారు. ఇందులో దళిత సంఘాల నాయకులు చందాల రాజన్న, ఊశన్న, ప్రవీణ్, అశోక్, దయాకర్, బీజేపీ నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

ఏజెన్సీలో జయంతి వేడుకలు

ఉట్నూర్: భారత మాజీ ఉప ప్రధాని దివంగత డాక్టర్ బాబూ జగ్జీవన్‌రామ్ 116వ జయంతి కార్యక్రమాలను ఉట్నూర్ ఏజెన్సీలోని ప్రజలు శుక్రవారం ఘనంగా నిర్వహించుకున్నారు. దీనిలో భాగంగా ఖానాపూర్ శాసనసభ్యుడు వెడ్మ బొజ్జుపటేల్ ఉట్నూర్‌లో జరిగిన కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరై జగ్జీవన్‌రామ్ విగ్రహానికి పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ బాబూ జగ్జీవన్‌రామ్ గొప్ప సంఘ సంస్కర్త, స్వాతంత్ర సమరయోధుడని, 57 సంవత్సరాలు ఎంపీగా ఉప ప్రధానిగా నిరుపేదల కోసం ఎన్నో రాజకీయ సంస్కరణలు ప్రవేశ పెట్టి సేవ చేసిన రాజకీయ నాయకుడిగా కాకుండా నిరుపేదల కోసం నిరంతరం తన ఊపిరి ఉన్నంత వరకు సేవ చేసిన గొప్ప వ్యక్తి అని కొనియాడారు. ఆయన చూపిన మార్గంలో మనము నిరుపేదల కోసం బలహీన వర్గాల కోసం కృషి చేయాల్సి ఉందన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ ఆదిలాబాద్ ఎంపీ అభ్యర్థి ఆత్రం సుగుణ, కాంగ్రెస్ పార్టీ ఎస్సీ సెల్ జిల్లా అధ్యక్షుడు లింగంపల్లి చంద్రయ్య, కాంగ్రెస్ పార్టీ జిల్లా కార్య నిర్వాహక అధ్యక్షుడు బిరుదుల లాజర్, కాంగ్రెస్ పార్టీ ఎస్సీ సెల్ జల్లా కన్వీనర్, దూట రాజేశ్వర్, అచ్చ దేవానందం, ఖయ్యూమ్, నిస్సర్, పరమేశ్వర్, శ్రీరాములు, అన్నపూర్ణ, నీలాబాయి, రాజేష్ జాదవ్, సంతోష్, కాంగ్రెస్ పార్టీ నాయకులు, మాదిగ కుల పెద్దలు కొమ్ము బాపురావు, కూటికెల ఆశణ్ణ, కాంతారావు, కొల్లూరి లింగన్న, బెరిగేడి మనోహర్, అరకిల్లా అశోక్, కాటం రమేష్, సంఘ నాయకులు వివిధ రాజకీయ పార్టీ నాయకులు ప్రజా సంఘాల నాయకు లు, తదితరులు పాల్గొన్నారు. ఇది ఇలా ఉండగా మాజీ ఎంపీ రాథోడ్ రమేష్ ఈ కార్యక్రమానికి హాజరై జగ్జీవన్‌రామ్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళు లర్పించారు. ఆయన వెంట బీజేపీ జిల్లా కార్యదర్శి కొండేరి రమేష్ ఉన్నారు. ఉట్నూర్ మండల కేంద్రంలోని ఆర్టీసీ బస్టాండ్‌లో ఆర్టీసీ ఉద్యోగులు బాబూ జగ్జీవన్‌రామ్ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘన నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో డీసీ పోశెట్టి, అజం, పోశెట్టి, అవినాశ్, జార్జ్, మూర్తి, దేవన్న, తదితరులు పాల్గొన్నారు.





ఉట్నూర్‌లో జగ్జీవన్‌రామ్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే బొజ్జుపటేల్, మాజీ ఎంపీ రాథోడ్ రమేష్

భక్తిశ్రద్ధలతో మురళీకృష్ణ ఆలయంలో విగ్రహ ప్రతిష్ఠాపన

- హాజరైన పీఠాధిపతి యోగనంద సరస్వతి

జైనథ్ రూరల్, ఏప్రిల్ 5: మండలంలోని మాండగడ గ్రామంలో నూతనంగా నిర్మించిన మురళీకృష్ణ ఆలయంలో గత మూడు రోజులుగా కొనసాగుతున్న శ్రీకృష్ణుని విగ్రహ ప్రతిష్ఠాపన వేడుకలు శుక్రువారం భక్తి శ్రద్ధలతో ముగిశాయి. ఈ సందర్భంగా వేద పండితుల మంత్రోచ్ఛరణల మధ్య శ్రీకృష్ణుడి విగ్రహాన్ని ప్రతిష్ఠించారు. ఈ కార్యక్రమానికి వచ్చిన ఆదిలాబాద్ గోపాలకృష్ణ మఠం పీఠాధిపతి యోగానంద సరస్వతీ హాజరై ప్రత్యేక పూజలు నిర్వహించారు. అలాగే, ఎమ్మెల్యే పాయల శంకర్ హాజరై నియోజకవర్గ ప్రజలు పాడి పంటలతో సుఖంగా ఉండాలని వేడుకున్నారు. ఈ సందర్భంగా గ్రామంలో పల్లకీ ఊరేగింపు డప్పులు, భాజాల మధ్య కొనసాగింది. గ్రామంలో పెద్దఎత్తున అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో మాజీ మంత్రి జోగు రామన్న, జిల్లా పరిషత్ మాజీ చైర్మన్ చిట్యాల సుహాసినిరెడ్డి, జైనథ్ పీఏసీఎస్ చైర్మన్ బాలూరి గోవర్ధన్‌రెడ్డి, జైనథ్ మాజీ మార్కెట్ చైర్మన్ ముక్కెర గోదావరి ప్రభాకర్, మాజీ సర్పంచ్ సైపట్ హిందూ మహేందర్‌రావు, పెద్దసంఖ్యలో భక్తులు, గ్రామ ప్రజలు, తదితరులు పాల్గొన్నారు.



హాజరైన పీఠాధిపతి యోగానంద సరస్వతి, ఎమ్మెల్యే పాయల శంకర్

రంజాన్ వేళలు

శనివారం	ఆదివారం
ఇఫ్తార్ సా.6.36	సహర్ ఉ.4.43



సత్కార్యం దైవ ప్రసన్నతను ఆశిస్తూ.. చిత్తశుద్ధితో చేయాలి. లోకుల మెప్పుకోసం చేసే సత్కార్యాన్ని అల్లాహ్ ఇష్టపడడు.

అంతటా బాబూ జగ్జీవన్‌రామ్ జయంతి



పూలమాల వేసి నివాళులర్పిస్తున్న
కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్, జిల్లా అధికారులు



జగ్జీవన్‌రామ్‌కు నివాళులర్పిస్తున్న మున్సిపల్ చైర్మన్ ఈశ్వర్

నిర్మల్ టౌన్, ఏప్రిల్ 5 : అణగారిన వర్గాల అభ్యుదయానికి అలుపెరగని కృషి చేసిన సంఘ సంస్కర్త భారత మాజీ ఉప ప్రధాని, బాబు జగ్జీవన్ రామ్ జయంతి ఉత్సవాన్ని కలెక్టర్ కార్యాలయ సమావేశ మందిరంలో ఘనంగా నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన జిల్లా కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్, అదనపు కలెక్టర్లు ఫైజాన్ అహ్మద్, కిషోర్ కుమార్ జగ్జీవన్‌రామ్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పిం చారు. ఈ కార్యక్రమంలో డీఎస్సీడీవో రాజేశ్వర్, డీఆర్‌వో భుజంగరావు, అధికారులు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

నివాళులర్పించిన నిర్మల్ మున్సిపల్ చైర్మన్ ఈశ్వర్

నిర్మల్ కల్చరల్ : నిర్మల్ జిల్లా కేంద్రంలో భారత తొలి ఉప ప్రధాని డాక్టర్ బాబు జగ్జీవన్ రామ్ 117వ జయంతి వేడుకలను శుక్రవారం ఘనంగా నిర్వహించారు. మున్సిపల్ కార్యాలయంలో జగ్జీవన్ రామ్ చిత్రపటానికి పూలమాల వేసి ఘన నివాళులర్పించారు. జగ్జీవన్ సేవలను కొనియాడారు. కమిషనర్ సీవీఎన్ రాజు, ఏఈ హరిభువన్, కౌన్సిలర్లు లక్కాకుల నరహరి, పూదరి రాజేశ్వర్, తులసి నర్సాగౌడ్, బిట్లింగ్ నవీన్, ఎడపల్లి నరేందర్, తదితరులు పాల్గొన్నారు.

నివాళులర్పించిన ఎమ్మార్పీఎస్...

బాబు జగ్జీవన్ రామ్ జయంతి వేడుకలను ట్యాంక్ బండ్ సమీపంలోని అంబేద్కర్ విగ్రహం వద్ద శుక్రవారం ఎమ్మార్పీఎస్ నాయకులు ఘనంగా నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. నవభారత నిర్మాణ సారధి జగ్జీవన్ రామ్ అని, దేశానికి ఆయన చేసిన సేవలను ప్రస్తుతించారు. రవి మాదిగ, ముత్యం, అడెల్లు, సాగర్, నిగులపు లింగన్న, తదితరులు పాల్గొన్నారు.

టీఎన్జీవో భవనంలో..

నిర్మల్‌లోని టీఎన్జీవో భవనంలో శుక్రవారం బాబు జగ్జీవన్‌రామ్ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అధ్యక్షుడు ప్రభాకర్ మాట్లాడుతూ... బడుగు, బలహీన వర్గాల ఆశాజ్యోతి జగ్జీవన్ రామ్ అని కొనియాడారు. ఆయన ఆశయాలు కొనసాగించాలని పిలుపునిచ్చారు. నాయకులు శ్రీరామ్ శ్రీనివాస్, ఎస్. మోహన్ రెడ్డి, గంగాధర్, యోగేష్, డి. రాములు, ఎస్. రాజన్న, తదితరులు పాల్గొన్నారు.

సారంగాపూర్ : మండల కేంద్రంలో జగ్జీవన్ రామ్ జయంతిని బొల్లోజి నర్సయ్య, నారాయణరెడ్డి, ఎర్రం గంగన్నలతో పాటు నాయకులు శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఈ నేపథ్యంలో ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన చేసినటువంటి సేవలను కొనియాడారు. ఈ కార్యక్రమంలో నాయకులు శ్రీనివాస్, ముత్యంలతో పాటు నాయకులు ఉన్నారు.

ముథోల్ : మండల కేంద్రమైన ముథోల్‌లో శుక్రవారం బాబు జగ్జీవన్ రామ్ 117వ జయంతిని ఘనంగా జరుపుకున్నారు. ప్రతి ఒక్కరూ ఆయన చూపిన అడుగుజాడల్లో నడచుకోవాలని పలువురు పేర్కొన్నారు. బడుగు బలహీన వర్గాలకు చేసిన సేవలను గుర్తు చేసుకుంటూ బహుజన యువత కూడా రాజ్యాధికారం దిశగా అడుగులు వేయాలని, మంచిగా ఉన్నత చదువులు చదువుకుని అంబేద్కర్, పూలే, గాడ్గే బాబా, జగ్జీవన్ రామ్‌లను ఆదర్శంగా తీసుకొని రాజకీయాల్లో ఉత్తమమైన సేవలను ప్రజలకు అందించేందుకు ముందుకురావాలని పేర్కొన్నారు. అలాగే ప్రభుత్వ సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలలో కూడా బాబు జగ్జీవన్‌రామ్ జయంతి నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీటీసీ పోతన్న యాదవ్, మోచి సంఘం అధ్యక్షులు భూమన్న, భోజారాం, సాయిలు, అబ్బయ్య, రమేష్, పవన్, గంగాధర్, ముత్యం, ఖలీద్, గ్రామస్థులు పాల్గొన్నారు.

కుంటాల : మండల కేంద్రమైన కుంటాలతో పాటు ఆయా గ్రామాల్లో శుక్రవారం బాబు జగ్జీవన్‌రామ్ జయంతిని ఘనంగా నిర్వహించారు. స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో ఆర్ఐ అడెల్లుతో పాటు స్థానిక సిబ్బంది జగ్జీవన్‌రామ్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఆయన ఆశయన సాధనకు ప్రతి ఒక్కరు కృషి చేయాలని పేర్కొన్నారు.

ఇన్‌చార్జి మంత్రిని కలిసిన టీజేఎస్ నాయకులు



ముథోల్, ఏప్రిల్ 5 : రాష్ట్ర పంచాయతీరాజ్‌శాఖ మంత్రి, ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా ఇన్‌చార్జి మంత్రి సీతక్కను టీజేఎస్ అధినేత ప్రొఫెసర్ కోదండరాం టీజేఎస్ ముథోల్ నియోజకవర్గ ఇన్‌చార్జి సర్దార్ వినోద్ కుమార్ శుక్రవారం హైదరాబాద్‌లోని ప్రజాభవన్‌లో కలిశారు. ఈ సందర్భంగా ఆదిలాబాద్ పార్లమెంట్ ఎన్నికలపై ఇద్దరు నేతలు చర్చించారు. కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థిని ఆత్రం సుగుణ గెలుపు కోసం టీజేఎస్ నేతలు అందరినీ కలుపుకొని అహర్నిశలు శ్రమించాలని, ఆదివాసీల ఖిల్లా ఆదిలాబాద్ గడ్డ మీద కాంగ్రెస్ జెండా ఎగరాలని దానికోసం సీరియస్‌గా పని చేయాలని సూచించినట్లు తెలిపారు. కార్యక్రమంలో నేతలు సర్దార్ వినోద్‌కుమార్, రతన్‌రావు, ఇందిర శోభన్ తదితరులు పాల్గొన్నారు.

ఊరూరా జగ్జీవన్‌రామ్ జయంతి వేడుకలు



కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానిస్తున్న ఎమ్మెల్యే పాయల శంకర్

బీఆర్ఎస్ మునిగిపోయే నావ : ఎమ్మెల్యే

ఆదిలాబాద్ అర్బన్, ఏప్రిల్ 5: మూడవసారి కూడా ప్రధానిగా నరేంద్రమోదీని ప్రజలు చూడాలనుకుంటున్నారని ఎమ్మెల్యే పాయలశంకర్ అన్నారు. శుక్రవారం ఆయన నివాసంలో బేల మండలంలోని చప్రాల గ్రామానికి చెందిన బీఆర్ఎస్ నాయకులు బీజేపీలో చేరారు. ఈ సందర్భంగా వారికిపార్టీ కండువాలు కప్పి బీజేపీలోకి ఆహ్వానించారు. ఎంపీ అభ్యర్థి గెలుపుకు కృషి చేయాలని పార్టీలో చేరిన వారికి సూచించారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే పాయలశంకర్ మాట్లాడుతూ బీఆర్ఎస్ పార్టీ మునిగిపోయే నావా అని అందులోభవిష్యత్తు లేదన్నారు. ప్రధానమంత్రి నరేంద్రమోదీ చేపట్టిన కార్యక్రమాలను చూసి మూడో సారి కూడా ఆయన్ను ప్రధాని చేయాలని ప్రజలు నిర్ణయించుకున్నారని తెలిపారు. గల్లీలో ఏ ప్రభుత్వం ఉన్న ఢిల్లీలో మాత్రం మోదీ ఉండాలనే లక్ష్యంతో ఇతర పార్టీల నుంచి నాయకులు వస్తున్నారన్నారు. ఆదిలాబాద్ పార్లమెంట్ స్థానాన్ని గెలిపించి మోదీకి బహుమానంగా ఇవ్వాలని కార్యకర్తలకు సూచించారు. ఈ కార్యక్రమంలో నాయకులు దత్తనికం మురళీధర్, పోశెట్టి, వెంకటేశ్, శివ, సాయికృష్ణ, విజయ్, మయూర్‌చంద్ర, తదితరులు పాల్గొన్నారు.

'నేడు బీజేపీ జెండాలను ఎగురవేయాలి'

బోథ్, ఏప్రిల్ 5: బీజేపీ పార్టీ ఆవిర్భావ దినోత్సవాన్ని పురస్కరించుకుని రాష్ట్ర శాఖ ఇచ్చిన పిలుపు మేరకు మండలంలోని అన్ని గ్రామాల్లో పార్టీ ఆవిర్భావ దినోత్సవ వేడుకలను పోలింగ్ బూత్ కమిటీల వారీగా 6వ తేదీన శనివారం నిర్వహించి పార్టీ జెండాలను ఎగురవేయాలని బీజేపీ ఓబీసీ జిల్లా అధ్యక్షుడు జి.రాజు యాదవ్ తెలిపారు. పార్లమెంట్ ఎన్నికల్లో అభ్యర్థులపై లక్ష్యంగా పని చేయాలని అందుకోసం టిఫిన్ బైటక్ ఏర్పాటు చేసుకుని అభ్యర్థి గెలుపు కోసం చేపట్టాల్సిన కార్యక్రమాలపై చర్చించాలన్నారు. పోలింగ్ బూత్ కేంద్రాల్లో ఎంపీ అభ్యర్థి గెలుపు కోసం చేపట్టాల్సిన చర్యల గురించి చర్చించాలన్నారు. అన్ని మండలాల్లో కార్యక్రమాలను విజయవంతంగా నిర్వహించాలని కార్యక్రమాల్లో ఓబీసీ మోర్చా నాయకులు తప్పనిసరిగా పాల్గొనాలని ఆయన కోరారు.

'రాములోరి కల్యాణానికి సహకరించాలి'

బోథ్, ఏప్రిల్ 5: ఈనెల 17న శ్రీరామ నవమిని పురస్కరించుకుని రాములోరి కళ్యాణ మహోత్సవాన్ని ఘనంగా నిర్వహించేందుకు ప్రతి ఒక్కరు సహకరించాలని ఆలయ కమిటీ చైర్మన్ జీ.వి.రమణ కోరారు. శుక్రవారం రామాలయంలో కమిటీ అధ్యక్షుడు జీవీ రమణ ఆధ్వర్యంలో హుండీ లెక్కించారు. హుండీలో భక్తులు వేసిన 41 వేల 555 భక్తులు వేయడం జరిగిందని ఆయన తెలిపారు. 16వ తేదిన యజ్ఞం నిర్వహించడం జరుగుతుందని, అనంతరం చేపట్టబోయే కార్యక్రమాలను ప్రతీఒక్కరు సహకరించాలని కోరారు.



ఆదిలాబాద్‌లో నివాళులర్పిస్తున్న మాజీ మంత్రి జోగు రామన్న



సుత్వాలలో జగ్జీవన్‌రాం చిత్రపటానికి నివాళులర్పిస్తున్న గ్రామస్థులు



జైనథ్‌లో జగ్జీవన్‌రామ్‌కు నివాళులర్పిస్తున్న నాయకులు



బోథ్ తహసీల్ కార్యాలయంలో పాల్గొన్న తహసీల్దార్, సిబ్బంది

● ఆదిలాబాద్ జిల్లాలో ఘన నివాళ్లర్పించిన నాయకులు

ఆదిలాబాద్ అర్బన్, ఏప్రిల్ 5: బీఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో జగ్జీవన్ రామ్ జయంతిని ఘనంగా జరుపుకున్నారు. జిల్లా అధ్యక్షుడు, మాజీ మంత్రి జోగు రామన్న, ఎంపీ అభ్యర్థి ఆత్రంసక్కులతో కలిసి జగ్జీవన్‌రాం చౌక్‌లో ఆయన చిత్రపటానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు.ఈ సందర్భంగా జోగురామన్న మాట్లాడుతూ భారత దేశానికి వైభవాన్ని తీసుకువచ్చిన మహనీయుడు మాజీ ఉప ప్రధాని, దివంగత నేత జగ్జీవన్‌రామ్ అని కొనియాడారు. కార్యక్రమంలో పాతఊర్ల నాయకులు అజయ్, అశ్రఫ్, రాజన్న, కుమ్రరాజు, వేణు, తదితరులున్నారు.

జైనథ్ రూరల్: మండలంలోని ఆయా గ్రామాలతో పాటు మండల కేంద్రమైన జైనథ్‌లో భారతదేశ మాజీ ఉప ప్రధానమంత్రి దివంగత జగ్జీవన్‌రాం జయంతి వేడుకలను శుక్రవారం ఘనంగా నిర్వహించారు. జైనథ్ జీపీ కార్యాలయంతో పాటు బాబుజగ్జీవన్‌రాం కార్యాలయంలో జగ్జీవన్‌రాం చిత్రపటానికి పూల మాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఎంఆర్‌పీఎస్ మండల అధ్యక్షుడు ఎం.స్వామిమాదిగ మాజీసర్పంచ్ డి.దేవన్నలు మాట్లాడుతూ ఆయన దళితుల అభివృద్ధి కోసం చేసిన సేవలు చిరస్మరణీయమ న్నారు. కార్యక్రమంలో బాబు జగ్జీవన్‌రాం సంఘం అధ్యక్షుడు అల్లకొండనవీన్, ఎంపీటీసీ కె.సుదర్శన్ బీజేపీ గ్రామకమిటీ అధ్యక్షుడు ఎన్ ప్రతాప్‌యాదవ్, నాయకులు పిడుగు స్వామి యాదవ్, కె.లస్మన్న, నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.



తేజాపూర్‌లో నివాళ్లర్పిస్తున్న గ్రామ యువకులు

నేరడగొండ: జగ్జీవన్‌రాం జయంతి వేడుకలను శుక్రవారం మండల వ్యాప్తంగా ఘనంగా నిర్వహించారు. మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయంతో పాటు గుత్పాల గ్రామంలో జగ్జీవన్‌రాం చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. తేజాపూర్ గ్రామంలో జగ్జీవన్‌రాం విగ్రహానికి యువకులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయా కార్యక్రమాల్లో పలువురు మాట్లాడారు.

అలాగే, మండలంలోని కుంటాల బాలికల ఆశ్రమోన్నత పాఠశాలలో జగ్జీవన్‌రాం జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

బోథ్: బహుజనులను చైతన్యం చేయడంలో బాబు జగ్జీవన్‌రామ్ ఎంతో కృషి చేశారని అంబేద్కర్ సంఘం అధ్యక్షులు భగత్ ప్రవీణ్ పేర్కొన్నారు. బహుజనులను అన్ని రంగాల్లో అభివృద్ధి చేసేందుకు గాను డిప్రెషన్ క్లాసెస్‌ను ప్రారంభించారన్నారు. కార్మిక శాఖ మంత్రిగా ఎన్నో సంక్షేమ పథకాలను కార్మికుల కోసం అమలు చేసి గొప్ప మహానుభావుడు అని పేర్కొన్నారు. అంబేద్కర్ సంఘ భవనం నుంచి బస్టాండ్ వరకు ర్యాలీగా వెళ్లిన అనంతరం బస్టాండ్‌లో జగ్జీవన్‌రామ్ చిత్ర పటానికి పూలమాలలు వేసి జయంతి వేడుకలను జరుపుకున్నారు. ఈ కార్యక్రమంలో అంబేద్కర్ సంఘం ప్రధాన కార్యదర్శి కె.లక్ష్మణ్, ఉపాధ్యక్షుడు సంజయ్, మాజీ అధ్యక్షులు బత్తుల రమేష్, భీమ్రావు పాటిల్, మహేష్, పొన్న, హరీష్, మాజీ ఎంపీటీసీ లంక లలిత, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

అలాగే, బోథ్ మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయంలో శుక్రవారం జగ్జీవన్ రామ్ జయంతి వేడుకలను ఘనంగా జరుపుకున్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ సుభాష్ చంద్ర, డిప్యూటీ తహసీల్దార్‌తో పాటు ఆర్ఐలు, సిబ్బంది పాల్గొన్నారు.

'కొనుగోలు కేంద్రాన్ని సద్వినియోగం చేసుకోవాలి'

ముథోల్, ఏప్రిల్ 5 : రైతులు వరి కొనుగోలు కేంద్రాన్ని సద్వినియోగం చేసుకోవాలని మండల వ్యవసాయ శాఖ అధికారి అజ్మీరాభాస్కర్ అన్నారు. మండలంలోని చించాల గ్రామంలో శుక్రవారం డీసీఎంఎస్ ఆధ్వర్యంలో వరి కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... ఏ రకం ధాన్యం క్వింటాల్‌కు రూ. 2,203, బి రకం ధాన్యం క్వింటాల్‌కు రూ. 2,183 చెల్లిస్తున్నామన్నారు. రైతులకు ఇబ్బందులు కలగకుండా సంబంధిత వరి కొనుగోలు కేంద్రాల వద్ద అన్ని సౌకర్యాలు కల్పిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో నిర్వాహకులు నర్సారెడ్డి, రైతులు, తదితరులు పాల్గొన్నారు.

మిషన్ భగీరథ కార్మికుల వేతనాలు పెంచాలి

● ఐఎఫ్‌టీయూ రాష్ట్ర కార్యదర్శి కే. రాజన్న

దిలావర్‌పూర్, ఏప్రిల్ 5 : మిషన్ భగీరథప్లాంట్‌లో పనిచేస్తున్న కార్మికుల వేతనాలను వెంటనే పెంచాలని ఐఎఫ్‌టీయూ రాష్ట్ర కార్యదర్శి కే. రాజన్న డిమాండ్ చేశారు. మండలంలోని మాడేగాం మిషన్ భగీరథ వాటర్‌ప్లాంట్‌లో తెలంగాణ ప్రగతిశీల మిషన్ భగీరథ వర్కర్స్ యూనియన్, (ఐఎఫ్‌టీయూ) ఆధ్వర్యంలో శుక్రవారం విధులు బహిష్కరించి గేటు బయట బైఠాయించారు. ఈ గేట్ మీటింగ్‌లో ఐఎఫ్‌టీయూ రాష్ట్ర కార్యదర్శి కే. రాజన్న మాట్లాడుతూ... మిషన్ భగీరథ కార్మికులకు జీవో నెంబర్ 60 ప్రకారం కనీస వేతనం 26 వేల రూపాయలు చెల్లించడంతో పాటు తక్షణమే పీఎఫ్ అమలు చేయాలన్నారు. రాత్రనకా పగలనకా ఎండలు, వానలు, చలిలో విధులు నిర్వహిస్తుంటే వారి సమస్యలను పట్టించుకోవడంలో మిషన్ భగీరథ యాజమాన్యం పూర్తిగా విఫలమైందని విమర్శించారు. కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్ వర్కర్స్‌ను రెగ్యులర్ చేయాలని డిమాండ్ చేశారు. కార్మికులు విధులు బహిష్కరించి గేటు మీటింగ్ పెట్టడంతో డిప్యూటీ ప్రాజెక్టు మేనేజర్ ప్రసాద్, డీఈ గణేష్, ఏఈ జ్ఞానేశ్వర్ దిగివచ్చి కార్మికులతో యూనియన్ సమక్షంలో చర్చలు జరిపారు. పీఎఫ్ నెల రోజుల్లో అమలు చేస్తామని, హెల్త్‌కార్డులు మంజూరు చేయడంతో పాటు సెలవులు ఇప్పిస్తామన్నారు. వేతనాలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తామని హామీ ఇవ్వడంతో కార్మికులు విధుల్లో చేరారు. ఈ కార్యక్రమంలో సాయినాథ్, దేవేందర్, పవన్, ముత్యం, సంతోష్, భీమన్న, తదితరులు పాల్గొన్నారు.



ఉమ్రి గ్రామస్థులతో మాట్లాడుతున్న ఆదిలాబాద్ కలెక్టర్ రాజార్షిషా

ఏజెన్సీ ప్రజలతో మమేకమై.. తాగునీటి సమస్యలను తెలుసుకున్న కలెక్టర్

ఉట్నూర్, ఏప్రిల్ 5: వేసవి కాలంలో ప్రజలు ఎదుర్కొంటున్న తాగునీటి సమస్యలను స్థానికుల ద్వారా తెలుసుకోవాలని భావించిన ఆదిలాబాద్ జిల్లా కలెక్టర్ రాజార్షిషా.. ఏజెన్సీ ప్రజలతో మమేకమై వారి ద్వారా సమస్యలను అడిగి తెలుసుకున్నారు. శుక్రవారం ఉట్నూర్ మండలంలోని ఉమ్రి గ్రామాన్ని ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా ఉమ్రిలో ఎ క్కడెక్కడ తాగునీటి సమస్య ఉందని గ్రామస్థులను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా గ్రామస్థులు మిషన్ భగీరథ నీరు రెండు మూడు రోజులకు ఒకసారి వస్తుందని, ఆ వచ్చిన నీరు ట్యాంకు నిండడం లేదని వివరించారు. దీని కోసం ట్యాంకర్లతో నీటిని సరఫరా చేయాలని, శాశ్వత పరిష్కారం కోసం ఉమ్రికి రెండు కిలో మీటర్ల దూరంలో చెరువు ఉందని గ్రామస్థులు తెలుపడంతో సర్వే చేసి నివేదిక సమర్పించాలని గ్రామీణ నీటిపారుదల శాఖ సూపరింటెండెంట్ ఇంజనీర్‌ను ఆదేశించారు. అనంతరం గ్రామంలో ఉన్న నూతన ఆంజనేయ స్వామి ఆలయాన్ని దర్శించుకొన్నారు. ఈ సందర్భంగా గ్రామస్థుల సహకారంతో ఆలయం నిర్మించుకున్నామని, ఆలయ ప్రహారిగోడకు నిధులు మంజూరు చేయాలని కలెక్టర్ కోరడంతో సమస్య పరిష్కారానికి కృషి చేస్తామని ఆయన వారికి హామీ ఇచ్చారు. అనంతరం ఉట్నూర్‌మండల కేంద్రంలోని జిల్లా ఆసుపత్రిని ఆకస్మికంగా తనిఖీ చేసి అన్ని గదులను పరిశీలించారు. ఈ సందర్భంగా పౌష్టిక ఆహార పునరావస కేంద్రంతో పాటు ఎస్ఎన్‌సీయూలను పరిశీలించారు. వైద్యుల డ్యూటీ చార్ట్ ఏర్పాటు చేసినట్లుగానే స్టాఫ్‌నర్సు, సిబ్బంది డ్యూటీల వారీగా చార్టు ఏర్పాటు చేయాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఆర్డీవో జివాకర్‌రెడ్డి, డిప్యూటీ డైరెక్టర్ దిలీప్‌కుమార్, ఐటీడీఏ ఈఈ రాథోడ్‌భీమ్‌రావు, పంచాయతీ రాజ్ డీఈ పవర్ రమేష్, మండల వ్యవసాయ అధికారి రాథోడ్‌గణేష్, మండల విద్యాధికారి గంగుల శ్రీనివాస్, మెడికల్ ఆఫీసర్ డాక్టర్ మహేందర్, తదితరులు పాల్గొన్నారు.



ఉట్నూర్‌లోని జిల్లా ఆసుపత్రిని తనిఖీ చేస్తూ..

బ్రిడ్జి నిర్మాణ పనుల పరిశీలన

బోథ్, ఏప్రిల్ 5: బోథ్ మంల కేంద్రం సమీపంలోని కంరెడీ వాగు వద్ద రెండు కోట్ల 20 లక్షలతో నిర్మిస్తున్న బ్రిడ్జి నిర్మాణ పనులను శుక్రవారం ఆర్అండ్‌బీ ఈఈ నర్సయ్యతో పాటు స్థానిక సిబ్బంది సునీల్, తదితరులు పరిశీలించారు. కాగా, బ్రిడ్జి నిర్మాణంలో భాగంగా స్లాప్ పనులను పర్యవేక్షించారు. నాణ్యత ప్రమాణాలకు తగ్గట్టుగా పనులు పూర్తి చేయాలని సూచించారు. జిల్లాలో ఆర్అండ్‌బీ పనులలో నాణ్యత ప్రమాణాలు పాటించే విధంగా పర్యవేక్షించడం జరుగుతుందని వారు తెలిపారు.



బ్రిడ్జి నిర్మాణ పనులను పరిశీలిస్తున్న ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్

'విద్యార్థుల ఆరోగ్యం పట్ల ప్రత్యేక శ్రద్ధ'

బోథ్, ఏప్రిల్ 5: విద్యార్థుల ఆరోగ్యం పట్ల ప్రభుత్వం ప్రత్యేకమైన శ్రద్ధ చూపించాలని ఆదేశించడం జరిగిందని, అందుకు గాను ప్రతీ శుక్రవారం హాస్టల్‌లో చదివే విద్యార్థులకు ప్రత్యేక వైద్య శిబిరం నిర్వహించి మందులను అందించడం జరుగుతుందని డాక్టర్ నవీన్‌రెడ్డి పేర్కొన్నారు. జిల్లా ఉన్నతాధికారి ఆదేశాల మేరకు వివిధ హాస్టల్‌లో హెల్త్ క్యాంపులను నిర్వహించడం జరుగుతుందున్నారు. పిల్లల ఆరోగ్యం బాగుంటేనే చదువుల్లో రాణిస్తారని అన్నారు.



కస్తూర్బాలో విద్యార్థులకు వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న వైద్యులు

రైస్‌మిల్లుల్లో నామమాత్రపు తనిఖీలు

● పేరుకుపోతున్న సీఎంఆర్ బకాయిలు

బాసర, ఏప్రిల్ 5 : బాసర మండలంలో స్థానిక తహసీల్దార్ పవన్‌చంద్ర ఆధ్వర్యంలో తనిఖీలు నిర్వహించారు. మండలంలోని పలు రైస్‌మిల్లుల్లో సీఎంఆర్‌కు సంబంధించిన రికార్డులను పరిశీలించారు. అయితే రైస్‌మిల్లుల్లో తనిఖీలు నామమాత్రంగానే కొనసాగుతున్నాయనే విమర్శలు ఉన్నాయి. ఇందుకు రైస్‌మిల్లుల్లో సీఎంఆర్ బియ్యం రికవరీ లెక్కలు తనిఖీల తీరుకు అద్దం పడుతున్నాయి. బాసర మండలంలో నాలుగు రైస్‌మిల్లులు ఉంటే రెండు రైస్ మిల్లుల నుంచి భారీ స్థాయి ప్రభుత్వానికి సీఎంఆర్ బియ్యం బకాయి ఉంది. గత ఏడాది ఖరీఫ్, రబీసీజన్‌తో పాటు ఈ ఏడాది ఖరీఫ్‌కు సంబంధించిన సీఎంఆర్ బియ్యం మండలంలోని రైస్‌మిల్లులు ఇవ్వాల్సి ఉంది. వాస్తవానికి వడ్లు డెలివరీ చేసిన మూడు నెలల్లో బియ్యాన్ని ఎఫ్‌సీఐకి అప్పగించాల్సి ఉంటుంది. ఇందుకు జిల్లా పౌరసరఫరాలశాఖ అధికారులు ఎప్పటికప్పుడు చర్యలు తీసుకుంటూ రైస్‌మిల్లుల నుంచి బియ్యాన్ని సేకరించుకోవాలి. కానీ అధికారుల నిర్లక్ష్యం మూలంగా రైస్‌మిల్లుల నుంచి రావాల్సిన సీఎంఆర్ బియ్యం బకాయి కొండలా పెరిగిపోతుంది. రైస్‌మిల్లులకు కేటాయించిన ధాన్యమే గాకుండా ఇతర రైస్‌మిల్లుల నుంచి ధాన్యాన్ని బదలాయిస్తూ ఒక్కో రైస్ మిలుకు వందల మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని పౌరసరఫరాల శాఖ అధికారులు అందజేస్తున్నారు. సకాలంలో బియ్యం డెలివరీ చేయకున్నా ధాన్యాన్ని మాత్రం ప్రతీ సీజన్‌కు కేటాయింపులు జరుపుతున్నారు. అధికారుల తీరు చూస్తుంటే తనిఖీలు, ఇతర చర్యలు మొక్కుబడిగా ఉన్నట్లు అర్థమవుతుంది. తాజా తహసీల్దార్ తనిఖీలు కూడా ఎప్పటిలాగే మమ అనిపించినట్లు విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. కొన్ని రైస్‌మిల్లుల వద్ద ధాన్యం నిల్వలు లేకున్నా ఉన్నాయనే నివేదికలు ఇస్తున్నారనే ఆరోపణలున్నాయి. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు బాసర మండలంలోని రైస్‌మిల్లులను గురువారం తనిఖీలు నిర్వ హించామని బాసర తహసీల్దార్ పవన్‌చంద్ర తెలిపారు. ఉన్నతాధికారులకు నివేదిస్తామని ఆయన తెలిపారు.

andhrajyothy.com
ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
శుక్రవారం ఉష్ణోగ్రత గరిష్ఠం 40.2 కనిష్ఠం 28.5
నిర్మల్
జిల్లా వార్తలు
6
శనివారం 6 ఏప్రిల్ 2024



బాసరలో ఉన్నతాధికారి పూజలు



బాసర, ఏప్రిల్, 5 : జిల్లావాసి, గతంలో స్థానికంగా సబ్ కలెక్టర్ పనిచేసి బదిలీపై వెళ్లిన శివలింగయ్య శుక్రవారం బాసర సరస్వతీ అమ్మవారి ఆలయాన్ని సందర్శించారు. కుటుంబ సమేతంగా అమ్మవారిని దర్శించుకొని ప్రత్యేకపూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా తనకు మారుడికి అమ్మవారి సన్నిధిలో అక్షర శ్రీకారపూజలు జరిపించారు.

సమస్యలపై.. తాడో.. పేడో



ఆందోళన చేస్తున్న ఆదివాసీలు (ఫైల్)

» బ్రిడ్జి, రోడ్ల నిర్మాణాల కోసం ఆదివాసీల అల్టిమేటం » అసెంబ్లీ ఎన్నికలప్పుడు రాసిచ్చిన బాండ్ పేపర్ సంగతేంది ? అని నిలదీత » అప్పటి సర్కార్ మోసం చేసిందంటూ ఆగ్రహం » కొత్త సర్కార్ పైనే ఆశలంటున్న అడవిబిడ్డలు » లోక్‌సభ ఎన్నికల సమయంలో గొంతెత్తుతున్న ఆదివాసీలు

నిర్మల్, ఏప్రిల్ 5 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలోని కడెం, పెంబి మండలాల్లోని పలు ఆదివాసీ గ్రామాలు తమ సమస్యల సాధన కోసం మరోసారి ఓటును అస్త్రంగా మలుచుకోబోతున్నాయి. గత అసెంబ్లీ ఎన్నికల్లో ఇక్కడి పలు గ్రామాలకు చెందిన ఆదివాసీలు బ్రిడ్జిలు, రోడ్ల సమస్యలపై గళమెత్తి నిరసనలు తెలిపారు. తమ సమస్యలను పరిష్కరించే వరకు ఓటు హక్కును వినియోగించుకోమంటూ మొండికేశారు. అయితే ఓటుపై అవగాహన కల్పించేందుకు తమ ఆదివాసీ గూడాలకు వచ్చిన ఆఫీసర్‌లను సైతం అడ్డుకొని తమ నిరసన వ్యక్తం చేశారు. ఓ దశలో అధికారులను తమ గూడెంలోకి రాకుండా అడ్డుకున్నారు. అయితే అధికారులు ఆదివాసీలకు సమస్య పరిష్కారంపై హామీనిచ్చి వారిని ఒప్పించారు. అయినప్పటికీ ఆదివాసీలు తమకు స్పష్టమైన హామీ వచ్చే వరకు ఓటింగ్‌లో పాల్గొనబోమంటూ మొండికేశారు. దీంతో ఆఫీసర్లు అక్కడి గ్రామాలకు బాండ్ పేపర్ రాసిచ్చి సమస్యలు పరిష్కారిస్తామన్నారు. అయితే ఐదు నెలలు గ్రామాలకు ఇప్పటి వరకు బ్రిడ్జి కానీ రోడ్ల సౌకర్యం కానీ చేకూరలేదు. అప్పటి బీఆర్ఎస్ ప్రభుత్వ నిర్లక్ష్య వైఖరి కారణంగానే ఈ ఆదివాసీ గూడెంలో ప్రజలు బ్రిడ్జిలు, రోడ్ల సౌకర్యానికి నోచుకోలేదు అంటున్నారు. సంబంధిత అధికారులు వీటి నిర్మాణం కోసం ప్రతిపాదనలు రూపొందించి ప్రభుత్వానికి పంపినప్పటికీ ప్రభుత్వం మాత్రం ఒక నయాపైసా కూడా మంజూరు చేయలేదు. దీంతో ఏళ్ల నుండి ఇక్కడి ఆదివాసీలు బ్రిడ్జి, రోడ్డు సౌకర్యానికి నోచుకోక తిప్పలు పడుతున్నారు. వర్షాకాలంలో వాగులపై బ్రిడ్జిల నిర్మాణం జరగకపోవడంతో ఇక్కడి అనేక ఆదివాసి గూడాలకు నెలల తరబడి రాకపోకలు నిలిచిపోతున్నాయి. అలాగే బాహ్య ప్రపంచంతో సంబంధాలు సైతం స్తంభించిపోతున్నాయి. రోడ్ల నిర్మాణం జరగక తమ గూడాలకు చేరుకునేందుకు వీరు అనేక రకాల అవస్థలు పడుతున్నారు.

ఓటెట్లెయ్యమంటారు.. కానీ

పెంబి మండలంలని పసుపుల గ్రామం వద్ద కడెంవాగుపై గతంలో నిర్మించిన బ్రిడ్జి మొన్నటి వరదల కారణంగా పూర్తిగా కొట్టుకుపోయింది. పూర్తిగా వరదల్లో కొట్టుకుపోయిన కారణంగా ఇరువైపులా గ్రామాలకు పూర్తిగా రాకపోకలు నిలిచిపోయాయి. ప్రస్తుతం ఈ వాగులో నుండే దాదాపు 5 గ్రామాలకు చెందిన ఆదివాసీలు రాకపోకలు సాగిస్తున్నారు. మళ్లీ వర్షాకాలం మొదలైతే ఇక ఈ వాగు దాటడం సాధ్యం కాదని వారంతా వాపోతున్నారు. అయితే గతంలో బ్రిడ్జిలు నిర్మించాలని అసెంబ్లీ ఎన్నికల సందర్భంగా ఈ గ్రామస్థులు ఆందోళనకు దిగారు అధికారులు బ్రిడ్జిని నిర్మిస్తామని హామీ ఇచ్చినప్పటికీ ఇప్పటి వరకు ఆ హామీ నెరవేరలేదని ఆదివాసీలు ఆరోపిస్తున్నారు. దీనికి తోడు వస్‌పెల్లి, దొందారి, చాకిరేవు, గుమ్మెన, ఎంగ్లాపూర్ గ్రామాలకు ఇప్పటి వరకు రోడ్డు సౌకర్యంతో పాటు త్రిఫేస్ కరెంటు సౌకర్యం లేకపోవడం సర్కారు నిర్లక్ష్యానికి అద్దం పడుతుందంటున్నారు. గత పదేళ్ల నుంచి బీఆర్ఎస్ ప్రజాప్రతినిధులు ఎన్నికల సమయంలో ఇక్కడికి వచ్చి ఆదివాసీల సమస్యలను పరిష్కరిస్తామంటూ హామీలు ఇచ్చినప్పటికీ ఏ ఒక్క హామీ నెరవేరలేదంటున్నారు.

తల్లడిల్లుతున్న 12 ఆదివాసీ గ్రామాలు

కాగా కడెం మండలం గంగాపూర్ గ్రామం వద్ద అక్కడివాగుపై బ్రిడ్జి నిర్మించాలని దాదాపు 12 గ్రామాలకు చెందిన ఆదివాసీలు ఏళ్ల నుంచి ప్రభుత్వాన్ని కోరుతున్నారు. బీఆర్ఎస్‌కు చెందిన ప్రజాప్రతినిధులు ఈ బ్రిడ్జి నిర్మాణానికి అనేకసార్లు హామీ ఇచ్చారు. అయితే ఇప్పటి వరకు ఆ హామీ నెరవేరలేదు. గంగాపూర్ బ్రిడ్జి నిర్మాణం జరిగితే రాణిగూడెం, కొర్రతండా, లక్ష్మీపూర్, దేవునిగూడెం, దత్రోజిపేట తదితర ఆదివాసీ గ్రామాలకు రవాణా సౌకర్యం ఏర్పడుతుందని అక్కడి ప్రజలు పేర్కొంటున్నారు. అయితే ఈ గ్రామాలకు చెందిన ఆదివాసీలంతా మొన్నటి అసెంబ్లీ ఎన్నికల సమయంలో పెద్దఎత్తున ఆందోళన చేపట్టి బ్రిడ్జి, రోడ్ల నిర్మాణంపై స్పష్టమైన హామీ ఇవ్వనట్లయితే తాము ఓటింగ్‌లో పాల్గొనబోమని ఆఫీసర్లకు స్పష్టం చేశారు. ఓ దశలో ఆఫీసర్లను తమ గ్రామంలోకి రావద్దంటూ డిమాండ్ చేశారు. దీంతో పాటు గ్రామంలోని గ్రామ పంచాయతీ ఆఫీస్‌కే కాకుండా అక్కడి ఫారెస్ట్ ఆఫీస్‌కు, స్కూల్ బిల్డింగ్‌కు తాళాలు వేసి తమ నిరసనను వ్యక్తం చేశారు. అయితే అధికారులు గ్రామస్తులకు నచ్చజెప్పి సమస్యను పరిష్కరిస్తామంటూ హామీ ఇవ్వడంతో వారంతా మొన్నటి ఓటింగ్‌లో పాల్గొన్నారు. అయితే ఇప్పటి వరకు తమ సమస్య పరిష్కారం కాకపోవడంతో రాబోయే ఎన్నికల సమయంలో వీరంతా మళ్లీ ఆందోళనకు దిగే అవకాశముందని అంటున్నారు.

కొత్త సర్కారు పైనే ఆశలు..

ఇదిలా ఉండగా గతంలో బీఆర్ఎస్ ప్రభుత్వం అంతకు ముందు టీడీపీ ప్రభుత్వాలు ఇక్కడి ఆదివాసీల సమస్యలను బేఖాతరు చేశాయి. తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తర్వాత తమ గ్రామాలకు బ్రిడ్జి రోడ్లు, కరెం టు సౌకర్యం లభిస్తాయని ఇక్క డి ఆదివాసీ గూడెంలు ఆశతో ఎదురుచూశాయి. కాగా పదేళ్ల పాటు పాలించిన బీఆర్ఎస్ ప్రభుత్వం ఇక్కడి ఆదివాసీల సమస్యలను పూర్తిగా పెడచెవిన పెట్టింది. దీని కారణంగా ఇక్కడి ఆదివాసీలు ప్రభుత్వ హామీలపై ఆశలు వదులుకున్నారు. ఇదిలా ఉండగా ఇటీవలే కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి రావడం అలాగే ఈ ప్రాంతానికి చెందిన ఆదివాసీ వెడ్మబొజ్జు ఎమ్మెల్యేగా ఎన్నిక కావడంతో పాటు ఆయన గత కొద్దిరోజుల నుంచి ఆదివాసీ గూడెంలలో విస్తృతంగా పర్యటిస్తూ అక్కడి ప్రజల సమస్యలను తెలుసుకుంటున్నారు. ఇప్పటికే ఆయన పసుపుల బ్రిడ్జితో పాటు గంగాపూర్ బ్రిడ్జి అలాగే త్రీఫైస్ కరెంటు సౌకర్యం లేని గ్రామాల పరిస్థితులను సీఎం రేవంత్‌రెడ్డికి వివరించారు. దీనిపై సీఎం సానుకూలంగా స్పందించారని కొద్దిరోజుల్లోనే సమస్యలన్నీ పరిష్కారం అవుతాయంటూ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు అక్కడి ప్రజలకు హామీ ఇస్తున్నారు.



వరద నీటి ప్రవాహానికి కొట్టుకుపోయిన పెంబి మండలంలోని పసుపుల బ్రిడ్జి (ఫైల్)

అయితే ఈసారి తమ సమస్యలపై మరింత స్పష్టమైన హామీ లభిస్తేనే తామంతా ఓటింగ్‌లో పాల్గొంటామంటూ అక్కడి ఆదివాసీలు స్పష్టం చేస్తున్నారు.

రాకపోకల సౌకర్యం లేక అవస్థలు

మారుమూల కడెం, పెంబి మండలాల్లోని అనేక ఆదివాసీ గ్రామాలకు రోడ్లు, కరెంటు, బ్రిడ్జిల సౌకర్యం లేని కారణంగా అనేక ఇబ్బందులు ఎదురవుతున్నాయి. వర్షాకాలంలో రాకపోకలన్నీ స్తంభించిపోతున్నాయి. నిత్యావసర వస్తువుల కొనుగోలు, వైద్యసౌకర్యాల కోసం ఇక్కడి ఆదివాసీలు అనేక తిప్పలు పడుతున్నారు. చాలా గ్రామాల్లో త్రాగునీటి సమస్య కూడా మొదలైంది. కాంగ్రెస్ ప్రభుత్వం వెంటనే ఆదివాసీల సమస్యలను పరిష్కరించాలి.

తొడసం శంభు, జిల్లా కార్యదర్శి, తెలంగాణ ఆదివాసి గిరిజన సంఘం

బోరిగాంలోని గిడ్డంగిని తనిఖీ చేసిన కలెక్టర్



గోదాంను పరిశీలిస్తున్న కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్

లక్ష్మణచాంద, ఏప్రిల్ 5 : మండలంలోని బోరిగాం గ్రామంలో గల గోదాంను జిల్లా కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ శుక్రవారం పరిశీలించారు. వేయింగ్ మిషన్, ఇతర పనులను వెంటనే పూర్తి చేసి అందుబాటులోకి తీసుకురావాలని అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ కిషోర్‌కుమార్, కాంట్రాక్టర్ జగన్మోహన్ రెడ్డి, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

రివార్డు అందించిన ఇంటెలిజెన్స్ ఐజీ



ఐజీ చేతుల మీదుగా రివార్డు అందుకుంటున్న అరుణ, సత్వాజీ దంపతులు

నిర్మల్ అర్బన్, ఏప్రిల్ 5 : జనజీవన స్రవంతిలో కలిసిన మావోయిస్టుల సంక్షేమానికి సహకరిస్తామని ఇంటెలిజెన్స్ ఐజీ సుమతి తెలిపారు. నిర్మల్ జిల్లాకు చెందిన మాజీ మావోయిస్టు వైదుగుల అరుణకు రూ. 10 లక్షల రివార్డును అందించారు. హైదరాబాద్‌లో గురువారం అరుణ, సత్వాజీ దంపతులకు తన కార్యాలయంలో ఈ రివార్డు చెక్కును అందించారు. మావోయిస్టు సెంట్రల్ కమిటీ సభ్యుడిగా చేసిన సత్వాజీ, జార్ఖండ్ రాష్ట్ర కమిటీ సభ్యురాలిగా చేసిన అరుణ 2019లో జనజీవన స్రవంతిలోకి వచ్చారు. అప్పట్లో అరుణపై ప్రకటించిన రివార్డును గురువారం అందజేశారు. అరుణ, సత్వాజీ దంపతులు తమ కుమార్తెతో కలిసి ఈ రివార్డును అందుకున్నారు.

వేసవిలో నీటి ఎద్దడి తలెత్తకుండా చూడాలి

కుంటాల, ఏప్రిల్, 5 : ప్రస్తుతం వేసవి కాలంలో ప్రజలకు తాగునీటి ఎద్దడి తలెత్తకుండా చూడాలని జిల్లా అదనపు కలెక్టర్ ఫైజాన్‌అహ్మద్ అన్నారు. శుక్రవారం మండలంలోని ఓలా గ్రామంలో ఇటీవల రూర్బన్ నిధులతోనిర్మించిన గోదామును పరిశీలించారు. అనంతరం హరితహారం నర్సరీతో పాటు తాగునీటి ట్యాంకును పరిశీలించారు. ఓహెచ్‌ఎస్ఆర్ ట్యాంకు ద్వారా గ్రామంలో ప్రజలకు నీటి సరఫరా గురించి అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ వచ్చే వేసవి కాలంలో ప్రజలకు ఎలాంటి తాగునీటి ఎద్దడి తలెత్తకుండా ప్రభుత్వం అన్ని ఏర్పాట్లు చేస్తుందని అధికారులు అప్రమత్తంగా ఉంటూ ఎప్పటికప్పుడు నీటి సరఫరాలో తలెత్తె సమస్యలను పరిష్కరించాలన్నారు. ఈయన వెంట ఎంపీపీ అప్క గజ్జారాం యాదవ్, ఎంపీడీవో రహీం, ఏపీవో నవీన్‌తో పాటు ఎంపీటీసీ కట్ట రవి, పంచాయతీ సెక్రటరీలు, టీఏలు తదితరులు ఉన్నారు.



తాగునీటి ట్యాంకును పరిశీలిస్తున్న అదనపు కలెక్టర్

కాంగ్రెస్‌లోకి భారీగా చేరిన బీఆర్ఎస్ నాయకులు

● కండువా కప్పి ఆహ్వానించిన డీసీసీ అధ్యక్షుడు శ్రీహరిరావు ● పార్టీలోకి చేరికల జోరు



డీసీసీ అధ్యక్షుడు శ్రీహరిరావు సమక్షంలో కాంగ్రెస్‌లో చేరుతున్న నిర్మల్ పట్టణ నాయకులు



పార్టీలో చేరుతున్న నర్సాపూర్ (జి) మండల నాయకులు

నిర్మల్ అర్బన్, ఏప్రిల్ 5 : బీఆర్ఎస్ పార్టీకి నిర్మల్ నియోజకవర్గంలో మరో గట్టి ఎదురు దెబ్బ తగిలింది. ఇప్పటికే చాలా మంది ఆ పార్టీకి చెందిన ప్రజా ప్రతినిధులు, సీనియర్ నాయకులంతా కాంగ్రెస్‌లో చేరిన సంగతి తెలిసిందే. కాగా శుక్రవారం బీఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకుడు, నిర్మల్ మార్కెట్ కమిటీ మాజీ ఛైర్మన్ రమణ డీసీసీ అధ్యక్షుడు శ్రీహరిరావు ఆధ్వర్యంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు. చిలుక రమణతో పాటు నిర్మల్‌లోని మహాలక్ష్మి ఆలయ కమిటీ ఛైర్మన్ కే. గంగాధర్, దేవరకోట దేవస్థానం డైరెక్టర్ చిలువేరి గంగాధర్‌తో పాటు మరో 50 మందికి పైగా కార్యకర్తలు కాంగ్రెస్‌లో చేరారు. డీసీసీ అధ్యక్షుడు శ్రీహరిరావు తన క్యాంప్ ఆఫీస్‌లో వీరందరికీ పార్టీ కండువాలు కప్పి ఆహ్వానించారు. ఈ సందర్భంగా శ్రీహరిరావు మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ, అభివృద్ధి పథకాలకు ఆకర్షితులవుతున్న నాయకులంతా బేషరతుగా కాంగ్రెస్ పార్టీలో చేరుతుండడం హర్షనీయమన్నారు. కాంగ్రెస్‌లో చేరిన నిర్మల్ పట్టణ నాయకులు మాట్లాడుతూ.. కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ, అభివృద్ధి పథకాలతో పాటు డీసీసీ అధ్యక్షుడు శ్రీహరిరావు నేతృత్వంలో ప్రజలకు మరింత సేవ చేసేందుకే కాంగ్రెస్‌లో చేరుతున్నట్లు వెల్లడించారు.

తుక్కుగూడలో జరిగే బహిరంగసభ విజయవంతం చేయాలి

ఈ నెల 6న హైదరాబాద్ తుక్కుగూడలో కాంగ్రెస్ పార్టీ పార్లమెంట్ ఎన్నికల మేనిఫెస్టో ప్రకటించనున్నారు. ఈ సభకు ఏఐసీసీ కాంగ్రెస్ పార్టీ జాతీయ అధ్యక్షులు మల్లికార్జున్ కార్గే, ఏఐసీసీ అగ్రనేతలు రాహుల్ గాంధీ, తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి హాజరుకానున్నారు. అసెంబ్లీ నియోజకవర్గం నుండి సుమారు 2000ల మంది జనసమీకరణ చేస్తున్నట్లు డీసీసీ అధ్యక్షులు కూచాడి శ్రీహరి రావు గురువారం తెలిపారు. కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు పెద్ద ఎత్తున తరలిరావాలని పిలుపునిచ్చారు.

బీసీ విద్యార్థి సంఘం రాష్ట్ర కార్యదర్శి డా. ఈసవేని మనోజ్‌యాదవ్ ఇటీవల బీఆర్ఎస్ పార్టీని వీడి శుక్రవారం తన అనుచరులతో నిర్మల్ జిల్లా డీసీసీ అధ్యక్షులు కూచాడి శ్రీహరిరావు సమయంలో కాంగ్రెస్ పార్టీలో చేరడం జరిగింది. ఈ సందర్భంగా మనోజ్ యాదవ్ మాట్లాడుతూ... కాంగ్రెస్ పార్టీ ప్రజా పాలనకు ఆకర్షితులై పార్టీలోకి చేరడం జరిగిందని తెలిపారు. పార్టీలో చేరిన వారిలో పిండి శ్రీనివాస్ యాదవ్, సిలారి నవీన్, అశోక్ యాదవ్, బిట్ల అశోక్, తదితరులు పాల్గొన్నారు.

నిర్మల్ కల్చరల్ : నిర్మల్ నియోజకవర్గంలో కాంగ్రెస్ పార్టీలోకి చేరికలు జోరుగా కొనసాగుతున్నాయి. శుక్రవారం డీసీసీ అధ్యక్షుడు కే.శ్రీహరిరావు కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. నర్సాపూర్ మండల అధ్య క్షుడు ఇంద్రకరణ్‌రెడ్డి, బీసీ సెల్ అధ్యక్షుడు అజీమ్ ఆధ్వర్యంలో బీఆర్ఎస్ పార్టీ నాయకులు హైమద్‌అలీ, ఎండీ గౌడ్, రాజు, ఐజాజ్, సాజిద్, షాహిత్ పటేల్, గఫూర్, హర్షద్ అలీలు కాంగ్రెస్‌లో చేరారు. బీసీ విద్యార్థి సంఘ రాష్ట్ర కార్యదర్శి మనోజ్ యాదవ్, ఎస్. నవీన్, పిండి శ్రీనివాస్, బిట్ల అశోక్, అశోక్ యాదవ్‌లు శ్రీహరిరావు ఆధ్వర్యంలో పార్టీలో చేరి కండువా కప్పుకున్నారు. రాబోయే పార్లమెంట్ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి గెలుపు కోసం కృషి చేయాలని ఆయన పిలుపునిచ్చారు. నరేందర్, కొంతం గణేష్, బురాజ్ తదితరులు పాల్గొన్నారు.

సీఎంకు రాజకీయాలపై ఉన్న ప్రేమ రైతులపై లేదు

● సర్కారుకు ముందుచూపు లేకనే పంటలు ఎండుతున్నాయి ● ఎన్నికల వేళ అన్నదాతలకు అబద్ధపు హామీలు ఇచ్చి అధికారంలోకి వచ్చారు ● రూ. 2 లక్షల రుణమాఫీ ఇప్పటివరకు కాలేదు ● దమ్ముంటే అసెంబ్లీ ఎన్నికల్లో ఇచ్చిన హామీలు అమలు చేశాకే లోక్‌సభ ఎన్నికల్లో ఓట్లు అడగాలి ● బీజేపీ రైతు సత్యాగ్రహ దీక్షలో బీజేఎల్పీ నేత ఏలేటి మహేశ్వర్‌రెడ్డి

నిర్మల్, ఏప్రిల్ 5 (ఆంధ్రజ్యోతి) : తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి రాజకీయాలపై ఉన్న ప్రేమ రైతులపై లేదని బీజేఎల్పీ నేత మహేశ్వర్ రెడ్డి ఆరోపించారు. శుక్రవారం నిర్మల్‌లోని ఆర్డీవో కార్యాలయం ఎదుట బీజేపీ ఆధ్వర్యంలో చేపట్టిన రైతు సత్యాగ్రహదీక్షలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా సర్కార్‌కు ముందుచూపు లేకనే పంటలు ఎండుతున్నాయన్నారు. రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చి నాలుగు నెలలవుతున్న సాగునీరు, విద్యుత్ సరఫరా విషయంలో తీవ్రనిర్లక్ష్యం చేశారన్నారు. ఎన్నికల వేళ అన్నదాతలకు కాంగ్రెస్ అబద్ధపు హామీలను ఆశచూపి అధికారంలోకి వచ్చిందని మండిపడ్డారు. ఇప్పటివరకు కాంగ్రెస్ ఇచ్చిన హామీలలో ఏ ఒక్కటి పూర్తిస్థాయిలో అమలుకు నోచుకోలేదని మహేశ్వర్‌రెడ్డి ఆరోపించారు. అధికారంలోకి వచ్చిన వెంటనే రెండు లక్షల రుణమాఫీ చేస్తానని రేవంత్ రెడ్డి ఇచ్చిన హామీ ఇప్పటివరకు ఎందుకు అమలు అవ్వలేదన్నారు. పంటకు క్వింటాల్‌కు రూ. 500ల బోనస్ ఇస్తామని చెప్పి ఎందుకు ఇవ్వలేదన్నారు. రైతు భరోసా సహాయం కింద రైతులకు ఎకరానికి ఇస్తామన్న రూ. 15 వేలు, కౌలు రైతులకు ఎకరానికి ఇస్తామన్న రూ. 12 వేల సహాయం ఎందుకు ఇవ్వలేదని ప్రశ్నించారు. ఈ ప్రభుత్వం రైతన్నకు సాగునీరు రావడం లేదని సబ్సిడీలు ఇవ్వడం లేదని మండిపడ్డారు. ఇప్పుడు పంటలు ఎండిపోతే పరిహారం ఇచ్చే దిక్కు లేదన్నారు. వెంటనే పంట నష్టపోయిన రైతులకు ప్రభుత్వం సహాయం అందించాలని డిమాండ్ చేశారు. దమ్ముంటే అసెంబ్లీ ఎన్నికల్లో ఇచ్చిన హామీలను అమలు చేసిన తర్వాతనే రేవంత్ రెడ్డి లోక్‌సభ ఎన్నికల ప్రచారానికి రావాలని మహేశ్వర్‌రెడ్డి సవాల్ విసిరారు. ఇచ్చిన హామీలను అమలు చేయకుండా ఎన్నికల ప్రచారానికి వస్తే ముఖ్యమంత్రిని, మంత్రులను ప్రజలు ఎక్కడికక్కడ నిలదీస్తారన్నారు. రైతులకు ఇచ్చిన హామీల విషయంలో కాంగ్రెస్ ప్రభుత్వం అన్నదాతలకు క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో బీజేపీ జిల్లా అధ్యక్షుడు అంజు కుమార్ రెడ్డి, ఆదిలాబాద్ పార్లమెంట్ ఇన్‌చార్జి అయ్యన్నగారి భూమయ్య, పెద్దపల్లి పార్లమెంట్ ఇన్‌చార్జి రావుల రాంనాథ్, నాయకులు సామ రాజేశ్వర్, మేడిసెమ్మె రాజు, ఒడిసెల అర్జున్, వడ్డీ రాజేందర్‌రెడ్డి, నాయకులు ఉదయ్ గౌడ్, తదితరులు పాల్గొన్నారు.



జిల్లా కేంద్రంలో జరిగిన బీజేపీ రైతు సత్యాగ్రహదీక్షలో ప్రసంగిస్తున్న బీజేఎల్పీ నేత ఏలేటి మహేశ్వర్‌రెడ్డి

రేషన్‌డీలర్ల మండల సంఘం అధ్యక్షుడిగా బన్నెబోయిన పోశెట్టి

లక్ష్మణచాంద, ఏప్రిల్ 5 : రేషన్ డీలర్ల మండల సంఘం అధ్యక్షుడిగా బన్నెబోయిన పోశెట్టిని శుక్రవారం ఎన్నుకున్నారు. మండలంలోని వడ్యాల్ గ్రామంలో గల ఎల్లమ్మ ఆలయం వద్ద జరిగిన సమావేశంలో ఈ ఎన్నికను నిర్వహించారు. గౌరవ అధ్యక్షురాలిగా ఓడ్నాల సునీత రాజేశ్వర్, ఉపాధ్యక్షులుగా లింగన్న, జుంజురు రాజేశ్వర్, కోశాధికారిగా గుడిసే రాజేందర్, కార్యదర్శిగా అబ్బిడి శ్రీనివాస్ రెడ్డిలు ఎంపికయ్యారు. ఈ కార్యక్రమంలో గడ్డం శ్రీనివాస్ రెడ్డి, కప్పకంటి మోహన్, కోరుకొప్పుల రాజాగౌడ్, బోరిగాం గంగాధర్, తదితరులు ఉన్నారు.

సంక్షిప్త సమాచారం

వడదెబ్బతో వివాహిత మృతి



మృతి చెందిన స్వర్ణలత (ఫైల్)

నిర్మల్, ఏప్రిల్ 5 (ఆంధ్రజ్యోతి) : జిల్లాకేంద్రంలోని జీఎన్ఆర్ కాలనీకి చెందిన స్వర్ణలత(45) అనే వివాహిత వడదెబ్బతో మృతి చెందారు. ఇరిగేషన్ శాఖలో ఏఈగా పనిచేస్తున్న గంగాధర్ భార్య అయిన స్వర్ణలత గత రెండు రోజుల నుంచి ఎండదెబ్బ కారణంగా తీవ్ర అస్వస్థతకు గురయ్యారు. చికిత్స పొందుతూనే ఆమె మరణించారు. కాగా గత వారం రోజుల నుంచి జిల్లాలో ఉష్ణోగ్రతలు విపరీతంగా పెరిగిపోతున్నాయి. 43.5 డిగ్రీల వరకు ఉష్ణోగ్రతలు చేరుకున్నాయి. ఇప్పటికే చాలా మంది వడదెబ్బకు గురై ఆసుపత్రులలో చేరారు. కాగా మృతురాలు స్వర్ణలతకు ముగ్గురు కూతుళ్లు వైష్ణవి, జయంతిక, ప్రత్యూషలు ఉన్నారు.

ఎస్‌వో, హెడ్ కుక్‌పై కేసు నమోదు

నర్సాపూర్(జి), ఏప్రిల్ 5 : మండల కేంద్రంలోని కేజీబీవీ బాలికల పాఠశాలలో విధుల్లో నిర్లక్షం వహించి, పిల్లల అనారోగ్యానికి కారణమైన ఎస్‌వో చింతపండు సునీత , హెడ్‌కుక్ పద్మపై జిల్లా విద్యాశాఖ అధికారి ఆదేశాలతో మండల విద్యాధికారి కస్తూరి శంకర్ చర్యలు తీసుకోవాలని శుక్రవారం పోలీస్ స్టేషన్‌కు వచ్చి ఫిర్యాదు చేసినట్లు ఎస్సై మునిగెల హన్మాండ్లు తెలిపారు. 336(34) సెక్షన్లతో కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు పేర్కొన్నారు.

అక్రమంగా మద్యం విక్రయిస్తున్న వారిపై కేసు నమోదు



మండలంలోని చాక్‌పల్లి గ్రామంలో శుక్రవారం రాత్రి అనుమతి లేకుండా, ఎటువంటి లైసెన్సు లేకుండా మద్యం విక్రయిస్తున్న మంగళి ముత్యంపై సుమోటో కేసు నమోదు చేసినట్లు ఎస్సై మునిగెల హన్మాండ్లు తెలిపారు. అతని వద్ద నుంచి పదమూడు లీటర్ల మద్యం పట్టుకోగా దాని విలువ 11,370 ఉంటుందని తెలి పారు.

తనిఖీల్లో రూ.1.44 లక్షల పట్టివేత

లక్ష్మణచాంద, ఏప్రిల్ 5 : మండలంలోని కనకాపూర్‌లో గల జాతీయ రహదారిపై పీచర గ్రామానికి చెందిన పోచంపల్లి రఘునందన్ వద్ద రూ. 1 లక్ష 44 వేలను లక్ష్మణచాంద పోలీసులు శుక్రవారం పట్టుకున్నారు. వాహనాలు తనిఖీ చేస్తుండగా ఈ డబ్బు దొరికినట్లు వివరించారు. ఎలక్షన్ కోడ్ దృష్ట్యా 50 వేలకు మించి నగదు కలిగి ఉండరాదన్నారు. కలెక్టర్ గ్రీవెన్స్‌లో తగిన ఆధారాలు చూపించి డబ్బును తీసుకోవచ్చని తెలిపారు. ఈ కార్యక్రమంలో సీఐ నవీన్‌కుమార్, ఎస్సై సల్లా శ్రీకాంత్, ఏఎస్సై నారాయణరెడ్డి, హెడ్ కానిస్టేబుల్ గంగాధర్, కానిస్టేబుల్ అశోక్, తదితరులు ఉన్నారు.